సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 21 । జూన్ । 2025

గిరిజన గ్రామాల్లో ఏనుగుల తిష్ట

కొత్తూరు: కొత్తూరు, సీతంపేట మండలాల సరిహద్దు గిరిజన గ్రామాలైన బడిగాం, జరడ, సుందరయ్యగూడ, తుబ్బలిగూడతో పాటు పలు గిరిజన గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి ఏనుగులు తిష్ట వేశాయి. విశాలమైన జీడితోటలతో పాటు నీరు తీసుకునేందుకు గెడ్డలు ఉన్నందున ఏనుగులు ఇక్కడే తిష్ట వేశాయి. ఏనుగుల గుంపు సంచారాన్ని గురువారం అటవీ శాఖ సిబ్బంది పరిశీలించారు. ఏనుగుల సంచారంతో గిరిజన గ్రామాలు వణికిపోతున్నాయి.


సుందరయ్యగూడ సమీపంలో ఉన్న తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

న్యూస్‌రీల్

కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు


అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు శుక్రవారం నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. ఆలయానికి సంబంధించి ఆలయ ప్రాంగణంలోని హుండీలను లెక్కించగా 86రోజులకు రూ. 5,59,597 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు శ్రీకాకుళం దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది.

సరిహద్దులో గట్టి నిఘా


చెక్‌పోస్టులో వాహనాలను పరిశీలిస్తున్న డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం: నవోదయం 2.0లో భాగంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఒడిశా మద్యం, నాటుసారా, గంజాయి వంటి నిషేధిత పదార్థాలను అరికట్టడానికి నిఘా పెంచాలని డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురంలో గల ప్రొహిబిషన్ ఎక్సైజ్ చెక్‌పోస్టుని శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాల్లో తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ సారా నివారణ కృషి చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల్లోని నిందితులపై చార్జిషీట్లు వేసి దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ సీఐ పి.దుర్గాప్రసాద్, ప్రొహిబిషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మెనూ ప్రకారం భోజనం పెట్టాలి'

పాతపట్నం: మండలంలోని సవర సిద్దమణుగు బాలుర ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 10, 9వ తరగతి విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చుని పాఠాలు విన్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెన్ జీవనరావుకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.అబ్బాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే.. మహాయోగం

యోగా మెల్లగా జీవితంలో భాగమవుతోంది. మన జనాలకు ఆసనాలపై ఆసక్తి పెరుగుతోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుండడంతో యోగా సెంటర్లు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. దీనికి తోడు పలువురు జిల్లా వాసులు యోగా పోటీల్లోనూ అదరగొడుతున్నారు. ఆరోగ్యం, ఆయుష్షుతో పాటు పేరు ప్రఖ్యాతలు కూడా వస్తుండడంతో ఈ రంగంలో రాణిస్తున్నారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా..


నరసన్నపేట సుమాబాల ఆధ్వర్యంలో యోగాలో శిక్షణ పొందుతున్న మహిళలు


సాధన చేస్తున్న శ్రీకాంత్ మహంతి

ఆసనాల్లో శ్రీకాంతులు

ఇచ్ఛాపురం: యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు పేరుప్రఖ్యాతలు కూడా సంపాదించుకోవచ్చని పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి రుజువు చేస్తున్నారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్‌మహతి శరీరాన్ని రబ్బరులా వంచుతూ ఆసనాలు వేస్తారు. బడి ఈడులోనే ఆయనలోని ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, స్థానిక యోగా సాధకుడు మధుసూదన్ బెహరా శ్రీకాంత్‌ను ప్రోత్సహించారు. అప్పటి నుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. ప్రస్తుతం ఆయన యోగాసనాల పోటీలకు జడ్జిగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నారు. 2010 నుంచి 2025 వరకు పదుల సంఖ్యలో బంగారు పతకాలు గెలుచుకున్నారు.


క్లిష్టమైన యోగాసనాలను సాధన చేస్తున్న శ్రీకాంత్‌మహంతి

● యోగ సాధకులు

నరసన్నపేట:

నరసన్నపేటకు చెందిన సుమా బాలబాల, సదాశివుని రవి, వండాన సుప్రజలు ఒకవైపు యోగా సాధన చేస్తూ శిక్షణ ఇస్తున్నారు. స్థానిక సూరజ్ నగర్‌కు చెందిన వి. సుమాబాల యోగా టీచర్‌గా నరసన్నపేటలో మంచి గుర్తింపు పొందారు. 2007లో యోగాలో పీజీ డిప్లమా పూర్తి చేసిన సుమాబాల నరసన్నపేటకు యోగా శిక్షణ పరిచయం చేశారు. నరసన్నపేటలోనే ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూ ఉచితంగా మహిళలకు యోగా నేర్పిస్తున్నారు. యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జీసీ హోంలో ప్రత్యేక యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు.


వండాన సుప్రజ


సుమాబాల


సదాశివుని రవి

చిన్న వయసు నుంచి..
స్థానిక జగన్నాథపురానికి చెందిన సదాశివుని రవి యోగాను ప్రాచుర్యంలోనికి తీసుకువచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో యోగాలో పీజీ డిప్లమా పూర్తి చేసిన రవి 2010 నుంచి శిక్షణలు ఇస్తున్నారు. 2017 వరకూ విశాఖలో క్లాసులు నిర్వహించగా తర్వాత నరసన్నపేటకు వచ్చి యోగా శిక్షణలు ఉచితంగా స్థానిక యోగా భవన్‌లో ఇస్తున్నారు.

మహిళలకు శిక్షణ నిస్తూ..
స్థానిక శ్రీరాంనగర్‌కు చెందిన వండాన సుప్రజ ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో పూర్తి శిక్షణ పొంది యోగా టీచర్‌గా పనిచేస్తున్నారు. పలు ప్రైవేటు స్కూల్స్‌లో పనిచేస్తూ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. 2018 నుంచి యోగా శిక్షణలు ప్రారంభించారు. పలు పోటీల్లోనూ పాల్గొన్నారు.

● పెరిగిన యోగా సెంటర్లు



శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో యోగా కేంద్రాల సంఖ్య పెరుగుతోంది. ఇవే కాకుండా ఆన్‌లైన్ లోనూ యోగా నేర్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యశాలలో యోగాభ్యాసం చేయిస్తోంది. ఇందుకోసం ఒక టీచర్‌ను కూడా ఏర్పాటు చేశారు.


40 ఏళ్లుగా యోగా సాధన



నేను 40 ఏళ్లుగా యోగా సాధన చేస్తున్నాను. మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఫ్రీ గురుకుల్ సేవా సంస్థలో యోగా, ప్రాణాయామం తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నాను. 77 ఏళ్ల వయసు వచ్చిన యువకులతో సమానంగా కొన్ని వందల మంది సాధకులతో 108 సూర్యనమస్కారాలు మాఘమాసంలో వేయిస్తుంటాను.

– ఎంవీ రామారావు, విశ్రాంత ఏఈ, బీఎస్ఎన్ఎల్, శ్రీకాకుళం

పత్రాసనం


రావి ఆకుపై యోగా చిత్రమాలిక

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళానికి చెందిన చిత్రకారుడు రాహుల్ పట్నాయిక్ రావి ఆకుపై ప్రధాని నరేంద్రమోదీ చిత్రంతో పాటుగా యోగాలోని సూర్యనమస్కారాలను చిత్రీకరించారు. ఈ చిత్రం ఆకట్టుకుంది.

23 ఏళ్లుగా..



నేను 23 ఏళ్లుగా యోగాభ్యాసం చేస్తున్నాను. శ్రీకాకుళంలోని యోగాచార్య రామారావు వద్ద యోగా నేర్చుకున్నాను. తర్వాత బెంగళూరు అంతర్జాతీయ యోగా యూనివర్సిటీలో డిప్లమో చేశాను. నా శిష్యులు కూడా చాలా యోగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

– మావురి నాగేశ్వరరావు, యోగా గురువు

మహిళలకు ఉచితంగా యోగా



ఇక్కడ కేవలం మహిళలకు మాత్రమే ఉచితంగా నేర్పుతున్నాను. ఈ పార్కులో ఉదయం 5గంటల నుంచి యోగాభ్యాసం జరుగుతుంది. కొన్ని ఆసనాలు ప్రదర్శించడం ద్వారా 16 ఏళ్ల వయసు నుంచి తరచూ వచ్చే పీరియడ్స్ సమస్యలు కూడా తొలగిపోతాయి.

– పిండి శారద, ఎల్‌బీఎస్ కాలనీ యోగా కేంద్రం


సత్యసాయి పెద్దమందిరంలో యోగా సాధన

అరసవల్లిలో సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరి



- ఆర్జిత సేవల్లో ఫ్యాషన్ దుస్తులకు అనుమతి నిరాకరణ
- రోజూ సాయంత్రం వరకు ఆదిత్యుని అంతరాలయ దర్శనాలు
- ఆదివారాల్లో రూ.300 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనం
- అరసవల్లి ఆలయ ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ ప్రకటన





అరసవల్లి:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే క్రమంలో ఆలయ సంప్రదాయాలను కాపాడేలా పలు కీలక నిర్ణయాలను ఆలయ ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో ఇకపై కల్యాణోత్సవాలు, క్షీరాభిషేక సేవలు, సూర్యనమస్కారాలు తదితర ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు ఫ్యాషన్ దుస్తులు వేసుకుంటే అనుమతి నిరాకరణ తప్పదని, కచ్చితంగా సంప్రదాయ వస్త్రధారణ నియమాలను పాటించాల్సిందేనని వివరించారు. సేవల్లో పాల్గొనే భక్తుల్లో పురుషులు పంచె, చొక్కా, స్త్రీలు చీర లేదా చుడీదార్‌లతో వస్తేనే ఈ సేవల్లో కూర్చునేందుకు అనుమతి ఉంటుందని ప్రకటించారు. అలాగే ఈ ఆర్జిత సేవల టిక్కెట్ల ధరలు పెంచేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదించనున్నామని, ఈ మేరకు అనుమతి రాగానే కల్యాణ సేవ, క్షీరాభిషేక సేవలు, సూర్యనమస్కారాల పూజల రుసుములు పెంచుతూ టిక్కెట్ల విక్రయాలు జరపనున్నట్లుగా ఆయన ప్రకటించారు. అలాగే ఆదిత్యుని అంతరాలయ దర్శనాల వేళలను ఇక మీదట సాయంత్రం వరకు ఉండేలా సమయం పెంపు చేస్తున్నామని, ఈ మేరకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మతో సంప్రదించే నిర్ణయాన్ని ప్రకటిస్తున్నామని వివరించారు.

సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రూ.100 టిక్కెట్లు కొనుగోలు చేసుకుని ఆదిత్యుని అంతరాలయ దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రూ.300 దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులను ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనాలకు అనుమతిస్తారని, అలాగే మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రూ.300 టిక్కెట్ల ద్వారా అంతరాలయ దర్శనాలకు అవకాశం కల్పించనున్నట్లుగా ఈఓ ప్రకటించారు.

23న యువత పోరులో గళమెత్తుదాం


యువత పోరు పోస్టర్ ఆవిష్కరణలో పార్టీ ముఖ్య నాయకులు

- ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు పిలుపు
- చంద్రబాబు యువతకు న్యాయం చేయాలి: ధర్మాన కృష్ణదాస్
- 20 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి? : మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు
- యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి పార్టీలు ఎన్నికల ముందు యువతకు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.4200 కోట్లు, వసతి దీవెనకు రూ.2200 కోట్లు అవసరమైతే కనీసం సగం నిధులు కూటా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ నెల 23న నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ విద్యార్థుల్ని, యువతను మోసం చేసిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు తగిన బుద్ధి చెప్పేందుకు ఈ నెల 23న నిర్వహించబోయే 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లాలో యువత, విద్యార్థులకు పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే భవిష్యత్‌లో ఉద్యమించక తప్పదన్నారు.

మాజీ మంత్రి, పార్టీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ప్రశ్నించడానికి పార్టీ పెట్టానని ప్రగల్భాలు పలికే పవన్ కల్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యాలపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. చంద్రబాబు మోసాలు, పవన్‌కల్యాణ్ ప్రశ్నించే గొంతు మూగబోయిందన్న విషయం ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. మొన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చినప్పుడు టీడీపీకి చెందిన వారే రప్పా రప్పా అంటూ ప్లకార్డులతో వస్తే దాన్ని వైఎస్సార్ సీపీ వాళ్లపై ఆపాదించడం దారుణమన్నారు.

ఈ సందర్భంగా యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1.90కోట్ల మంది నిరుద్యోగులకు రూ.3వేలు చొప్పున బకాయి పడ్డారన్నారు. కార్యక్రమంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ తూర్పు కాపు, కాళింగ, కళింగవైశ్య కుల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, అంధవరపు సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, జెడ్పీటీసీ రుప్ప దివ్య, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షులు రౌతు శంకరరావు, అంబటి శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి, యువజన విభాగం నగర, నియోజకవర్గ అధ్యక్షులు గుండ భాస్కర్, భరద్వాజ్, నక్క రామరాజు, పిల్లల రామకృష్ణ, సీపాన వెంకటరావు, టి.కామేశ్వరి, మట్ట నీలంయాదవ్, సీపానా రామారావు, మూకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

టెక్కలి: టెక్కలి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు శుక్రవారం ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో కాంప్లెక్స్‌లో పడిగాపులు కాస్తూ అవస్థలు పడ్డారు. విశాఖపట్టణంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి టెక్కలి ఆర్టీసీ డిపో పరిధిలో 41 బస్సులను తరలించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు బస్సులు లేకపోవడంతో, అధిక డబ్బులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు.

అర్ధరాత్రి ఇబ్బందులు

శ్రీకాకుళం అర్బన్: అర్ధరాత్రి పూట జనాలను తరలించాల్సి రావడంతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బస్సులన్నీ వైజాగ్ వెళ్లిపోవడంతో జిల్లా కేంద్రంలో ప్రయాణికులు తీవ్రంగా అవస్థలు పడ్డారు. జిల్లా నుంచి 220 బస్సులను వేశారు. ఇందులో 60 బస్సులు గురువారం ఉదయమే వెళ్లిపోవడంతో జిల్లాలోని పలు రూట్లలో సర్వీసులు లేకుండా పోయాయి.


టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు లేక పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు


యోగాంధ్ర కోసం అర్ధరాత్రి జనాలను తరలించడానికి ఉద్యోగుల పాట్లు

క్లుప్తంగా

మొగదాలపాడులో పూరిల్లు దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార: వత్సవలస పంచాయతీ మొగదాలపాడులో గనగళ్ల లక్ష్మమ్మకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విద్యుత్ మీటరు వద్ద మంటలు చెలరేగి ఇంటి మొత్తం వ్యాపించాయని బాధితురాలు తెలిపారు. గ్రామస్తులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ. 2 లక్షలు వరకు ఆస్తి నష్టం ఉంటుందని రెవెన్యూ సిబ్బంది అంచనా వేశారు.

జూలై 9న అఖిలభారత సమ్మె



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జూలై 9న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం సీఐటీయూ జిల్లా సమావేశం కార్యాలయంలో సమ్మె పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9న అన్ని మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు జరుగుతాయని, కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎస్.వి.రమణ, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీకాకుళం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశ్ పాల్గొన్నారు.

సుస్వరార్చనలో..



- విద్యతో పాటు సంగీతం నేర్చుకోవడంపై ఆసక్తి పెంచుకుంటున్న చిన్నారులు
- అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న సీనియర్ కళాకారులు
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం

చిన్నతనంలో ఆడుతూ పాడుతూ తిరిగే అల్లరి పిల్లల్ని మందలించే తల్లిదండ్రులు చదువు సంగీతం ఏమీ లేదేంట్రా అంటూ పిల్లలకు బుద్ధి చెప్పేవారు...కానీ వారు మాటవరుసకు పలికే ఆ చదువు సంగీతం అనే మాటలోనే ఆ రెండింటికీ ఉన్న అవినాభావ సంబంధం అర్థం అవుతోంది. ప్రస్తుతం సమాజంలో ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లలకు సంగీతం నేర్పిస్తున్నారు. ఇంకొందరు స్వతహాగా సంగీతాన్ని నేర్చుకోవాలనే ఇష్టంతో ఉన్నారు. ఈ క్రమంలోనే పలువురు విద్యార్థులు తమకు ఇష్టమైన సంగీత వాయిద్యాలలో పట్టు సంపాధించి జీవితంలో ఆ రంగంలోనే స్థిరపడాలనే ఆకాంక్షను కలిగి ఉంటూ నిరంతరం సాధన చేస్తున్నారు. మరికొందరు సీనియర్ కళాకారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అద్భుత ప్రదర్శనలు ఇస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

శ్రీకాకుళం కల్చరల్/కవిటి/ఇచ్ఛాపురం:

ఒత్తిడితో కూడిన జీవనానికి సంగీతం సాంత్వన కలిగిస్తుంది. మనస్సును ఆహ్లాదపరుస్తుంది. మానసిక ఆందోళనతో ఉండేవారికి ఔషధంలా పని చేస్తుంటుంది. అందుకే సంగీతానికి ఎప్పటికీ ఆదరణ కొనసాగుతునే ఉంటుంది. నాటితరమే కాకుండా నేటి యువతరం కూడా సంగీతంపై మక్కువ పెంచుకుంటోంది. క్రమం తప్పకుండా సాధన చేస్తూ వాయిద్యాలపై పట్టు సాధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల సంగీత శిక్షణ కేంద్రాల్లో చిన్నారులు తర్ఫీదు పొందుతున్నారు.

అనురాగ నిలయంలో..

జిల్లా కేంద్రంలోని అనురాగ నిలయంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు సూచనల మేరకు చిన్నారులకు రెడ్డి సత్యనారాయణ నేతృత్వంలో సంగీతం తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి అనాథ చిన్నారులు వేదికపై ప్రదర్శనలు కూడా ఇచ్చే స్థాయికి చేరుకున్నారు. తల్లిదండ్రులు లేనివారిని అక్కున చేర్చుకుని బాగోగులు చూడటంతో పాటు వారి అభిరుచి మేరకు సంగీతం నేర్పిస్తుండటంతో సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



సంగీతం నేర్చుకుంటున్న యువత

వైద్యం.. సంగీతం



వీణపై ప్రదర్శన ఇస్తున్న డాక్టర్ రామకృష్ణ

ఓవైపు వైద్య వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా సంగీత రంగంలోనూ రాణిస్తున్నారు జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ చిట్టి రామకృష్ణ. ప్రస్తుతం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో నేత్రవైద్యులుగా పనిచేస్తున్న ఈయన వీణా వాయిద్యంలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. విజయనగరం సంగీత కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా కెనడా, మలేషియా, బెంగళూరులోని విద్యార్థులు సంగీత తరగతులు నిర్వహిస్తున్నారు. ఇతని సతీమణి శ్రీసౌమ్య రేడియేషన్ అంకాలజిస్టుగా జెమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఆదిత్యా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్‌లో మిస్టర్ లోన్లీ సినిమాకు వీణ ప్రదర్శన చేశారు. ఆల్ ఇండియా రేడియో ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా నమోదయ్యారు. ఎస్‌బీవీసీ ఛానల్‌లో కూడా వీణ ప్రదర్శన ఇచ్చారు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు.

తండ్రి స్ఫూర్తితో..



తబలాపై ప్రదర్శన చేస్తున్న బండారు రమణమూర్తి

తన తండ్రి బండారు చిట్టిబాబు స్ఫూర్తితో తనకంటూ ప్రత్యేకతను చాటుకోడానికి తబలా విద్యను అభ్యసించారు బండారు రమణమూర్తి. సినీ నేపథ్య గాయకులు పి.సుశీల, ఎస్.జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ మంగళం పల్లి బాలమురళీకృష్ణ, లతామంగేష్కర్, సత్యసాయిబాబా తదితర ఉద్ధండులైన గాయనీ గాయకులకు తబలా సహకారాన్ని అందించారు. అనేక టీవీ షోలలో ప్రాతినిధ్యం వహించారు.

బ్యాంకు ఉద్యోగం చేస్తూనే..



మృదంగం వాయిస్తున్న శ్రీనివాస్

నగరానికి చెందిన మండా శ్రీనివాస్ యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ మృదంగంలోనూ రాణిస్తున్నారు. ఔత్సాహిక శాస్త్రీయ, లలిత, సినీ సంగీత కళాకారులందరిని ఒకే వేదికపై ప్రదర్శన అవకాశం కల్పించేందుకు తరుణి కృష్ణస్మారక ధార్మిక ట్రస్టు 2019లో ఏర్పాటు చేసి సంగీత రంగంలో కృషి చేస్తున్నారు.

కీబోర్డు రాజు..



రాజు ప్రదర్శన

నగరంలో కీబోర్డు రాజుగా తనకంటూ ప్రత్యేక పేరు సాధించారు ముంజేటి రాజు. బండారు రమణమూర్తి సంగీత సారథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఢిల్లీ, కోల్‌కతా, జంషెడ్‌పూర్, నాగపూర్ వంటి నగరాల్లో సంగీత ప్రదర్శనలు ఇస్తున్నారు. సినీ నేపథ్య గాయకులు గోపికాపూర్ణిమ, మల్లికార్జున్ ప్రోగ్రామ్స్‌లో కీబోర్డు సహకారం అందించారు.

అమ్మవారి సేవలో..



తంబూరాతో సుసరాపు లక్ష్మీగణపతి

ఓవైపు రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరీ దేవి పీఠంలో అమ్మవారి ఉపాసన చేస్తునే మరో వైపు ఆ అమ్మవారి పేరుతో సంగీత విద్యాలయాన్ని నడిపిస్తూ సంగీత సేవలందిస్తున్నారు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ. తన తండ్రి దుర్గాప్రసాద్ శర్మను స్ఫూర్తిగా తీసుకొని పీఠాన్ని నిర్వహిస్తునే వైణికుడిగా, గాయకుడిగా ప్రదర్శనలు ఇస్తూ ఎంతోమంది చిన్నారులకు, యువకులకు సంగీత విద్యను అభ్యసింపజేస్తున్నారు.

శాక్సోఫోన్ శ్రీనివాస్



శాక్సోఫోన్‌తో శ్రీనివాస్

హయతినగరానికి చెందిన సుందరపల్లి శ్రీనివాస్ శాక్సోఫోన్, క్లారినెట్ ప్రదర్శనలో రాణిస్తున్నారు. కర్నాటక సంగీతంలో దిట్ట. ఇప్పటికీ ప్రతి రోజు ఆరు గంటల పాటు సాధన చేస్తుంటారు. మైసూరు గురుదత్త ఆశ్రమం, విశాఖ, హైదరాబాద్, తిరుపతి తదితర పుణ్యక్షేత్రాల్లో తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

తాపీమేస్త్రీ నుంచి సంగీత గురువుగా..



శాస్త్రీయ సంగీతంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ఆశి కృష్ణారెడ్డి

శాస్త్రీయ సంగీతానికి పేదరికం అడ్డుకాదు అని ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన సంగీత కళాకారుడు ఆశికృష్ణారెడ్డి నిరూపించారు. బెల్లుపడ గ్రామంలో వ్యవసాయకూలీ కుటుంబానికి చెందిన ఆశి వాసు సరోజిని దంపతుల చిన్న కుమారుడు ఆశి కృష్ణారెడ్డి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో తాపీపని, కూలి పనులు చేసుకొంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచారు. సంగీతంపై మక్కువతో కె.ముఖలింగం, మావుడూరి జగన్నాథశర్మ, మావుడూరి సత్యనారాయణ శర్మ వద్ద సంగీతంలో మెలకువలు నేర్చుకున్నారు. మావుడూరి జగన్నాథశర్మ పేరిట సంగీత కళాశాలను ప్రారంభించి 22 మంది చిన్నారులకు ఉచితంగా సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు.

సంగీతమే జీవితం..



మూడు తరాలనుంచి మా కుటుంబం సంగీతంతో అల్లుకు పోయింది. మూడేళ్ల వయస్సులో మృదంగం నేర్చుకోవాలనే అభిరుచి కలిగింది. అమ్మ శ్రీలక్ష్మి, నాన్న సుసరాపు లక్ష్మీగణపతి శర్మ నా ఆలోచనకు సహకరించారు. ఇప్పటి వరకు పదులసంఖ్యలో కర్నాటక సంగీత కళాకారులతో కచేరీలకు మృదంగసహకారం అందించాను. –సుసరాపు కుమార్ విఘ్నేష్, మృదంగ కళాకారుడు,శ్రీకాకుళం

నాన్న ప్రోత్సాహంతో..



సంగీతం నేర్చుకోమని నాన్న ప్రోత్సహించారు. వయోలిన్ సాధన చేశాను. 2023లో జరిగిన కళా ఉత్సవ్ పోటీలో జ్ఞాపిక సాధించడం మరపురాని అనుభూతి. సంగీత రంగంలో స్థిరపడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. –చెన్నూరు వరుణ్‌సాయి, వయోలీన్ కళాకారుడు, సిలగాం, కవిటి

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గార: మండలంలోని సిలగాం గ్రామ సమీపంలో శుక్రవారం జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6600 స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. కాగా, పట్టుబడిన వారిలో మండలానికి చెందిన ఒక వీఆర్‌వో కూడా ఉన్నట్లు సమాచారం.

శ్రీకాకుళం రూరల్: చాపురం పంచాయతీ రామిగెడ్డ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతుండగా 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ రాము తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.4వేలు రికవరీ చేసినట్లు చెప్పారు.

టీడీపీ అరాచకాలకు మూల్యం చెల్లించక తప్పదు



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి : టీడీపీ నేతలు చేస్తున్న అరాచకాలకు ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించుకోకతప్పదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ హెచ్చరించారు. రాజకీయ కారణాలతో చిగురువలస కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త జరుగుళ్ల రాజారావు ఇంటిని కూటమి నేతలు కక్షకట్టి కూల్చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రవికుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కూల్చివేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు తుంగలోకి తొక్కిందని, ఇదేంటని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అధికార పక్ష ప్రధాన నేతలు లిక్కర్, ఇసుక, భూదందాలతో అక్రమంగా సంపదిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు, ఉద్యోగాలు, పింఛన్ల తొలగింపు తప్ప నియోజకవర్గానికి ఒరిగిందేమిలేదన్నారు. ఇప్పటికైనా అధికార పక్షనేతలు కక్షపూరిత రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, డకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, పార్టీ నేతలు అత్తులూరి రవికాంత్, కొవిలాపు చంద్రశేఖర్, మెట్ట నందేశు, కెప్టెన్ రామారావు, చల్ల యర్రయ్య, పల్లి శాంతారావు, ముద్దాడ రంజిత్, దనాల చిరంజీవి, బేవల రవి పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బీఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందని యూనివర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఉదయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పరీక్షలు, ఫీజు కలిపి మొత్తం రూ. 13,35 ఈ నెల 23వ తేదీ లోపు చెల్లించాలని కోరారు.


రేపు సాఫ్ట్‌బాల్ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఆదివారం ఏపీ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ కీలక సమావేశానికి ఇండియన్ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ సెక్రటరీ ప్రవీణ్ అరోరాతోపాటు పలవురు సాఫ్ట్‌బాల్ దిగ్గజాలు, రాష్ట్రంలోని 13 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ ప్రతినిధులు హాజరుకానున్నారు. మరో రెండేళ్లలో రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ కార్యకలాపాల విస్తరణ, వివిద జిల్లాలకు టోర్నమెంట్ల కేటాయింపులు, సంఘ బలోపేతం, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు వంటి అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. వీటితోపాటు ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎలక్షన్ అధికారిగా సీనియర్ రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, ఒలింపిక్ సంఘ జిల్లా నాయకులు, శాప్ ప్రతినిధులు, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ పెద్దలు హాజరుకానున్నారు. శ్రీకాకుళంలోని క్రిస్టల్ ప్యాలెస్ హోటల్ వేదికగా రేపు ఉదయం 10 గంటలకు జరిగే ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

జాయింట్ పట్టాదారుల విభజనకు ప్రత్యేక డ్రైవ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా వెబ్‌ల్యాండ్-2.0లో నమోదైన రైతులు ప్రభుత్వ పథకాలు పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. రెవెన్యూ శాఖ సాధారణంగా వసూలు చేసే రూ.500 రుసుము మినహాయించి రూ.50 నామమాత్రపు రుసుముతో జాయింట్ పట్టాల విభజన చేసేందుకు వీలు కల్పించామని పేర్కొన్నారు. జూన్ 30లోపు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూవివరాల విభజన అనంతరం అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర పథకాల కోసం రైతులు అర్హులుగా పరిగణిస్తారని జేసీ స్పష్టం చేశారు. ఇప్పటికే పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జాయింట్ పట్టాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవలో అర్హత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. పేద రైతులకు ఇది గొప్ప అవకాశమని, జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఆశా, సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో అంతా పాల్గొనాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.అనితకు సమ్మె నోటీసు అందజేశారు. పేదలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న తమకు కార్మికులుగా గుర్తించి సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.